క్లుప్తంగా

ఉద్యోగికి సత్కారం

బి.కోడూరు : పాయలకుంట్ల, మేకవారిపల్లె పంచాయతీల కార్యదర్శిగా పనిచేసిన మాబుల్‌రెడ్డి విశేషమైన సేవలందించారని సర్పంచ్ పెద్దిరెడ్డి రమణమ్మ తెలిపారు. మేకవారిపల్లె సచివాలయంలో బదిలీపై వెళ్లిన మాబుల్‌రెడ్డిని సిబ్బంది, గ్రామస్తులు శుక్రవారం సన్మానించారు. వెంకటసుబ్బారెడ్డి, లక్ష్మీనరసారెడ్డి, శివారెడ్డి, వెంకటరెడ్డి, ప్రహల్లాదరెడ్డి, సిద్దారెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

పోరుమామిళ్ల : క్రిస్మస్, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు చిత్తా శౌరిరెడ్డి మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. ఎఫ్‌సీఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, థామస్‌రెడ్డి దంపతులు పట్టణంలోని ఓఎల్ఎఫ్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, మహబూబ్ నగర్‌లోని ఎంపీపీ పాఠశాల, ఉర్దూ పాఠశాల, రంగసముద్రం ఎంపీపీ పాఠశాలల్లో చదువుతున్న 758 మంది విద్యార్థులకు సంస్థ ప్రతినిధుల ద్వారా దుస్తులు అందజేశారు.

దుప్పట్లు అందజేత

ప్రొద్దుటూరు కల్చరల్: పట్టణంలోని రోడ్లు, ఆలయాలు, బస్టాండు సమీపంలో చలికి వణుకుతూ.. దోమలతో ఇబ్బంది పడుతున్న అనాథలకు వివేకానంద ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. సంస్థ వ్యవస్థాపకుడు పాపిజెన్నీ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఏ ఆదరణ లేని వారికి తమ సేవాశ్రమంలో ఉచితంగా ఆశ్రయం కల్పిస్తామని తెలిపారు. పాతకోట శ్రీనివాసరెడ్డి, టి.వెంకట సురేష్, కేతన శ్రీనాథ్, నరసింహ, విజయ్, ఎం.రాజశేఖర్‌రెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని శనివారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ మల్లికార్జున ఓ ప్రకటనలో తెలిపారు. సభ్యులు, అధికారులు సమావేశానికి హాజరు కావాలన్నారు.

ఏప్రిల్ 15 వరకు నీరివ్వండి

ఖాజీపేట : కేసీకెనాల్ పరిధిలోని కేసీ రైతుల కోసం ఏప్రిల్ 15వ తేదీ వరకు నీరు ఇచ్చి రైతులకు మేలు చేయాలని ఏపీఎస్సార్టీసీ కడప మాజీ జోనల్ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. దుంపలగట్టు గ్రామంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కేసీ కెనాల్ రైతుల సంక్షేమం కోసం చంద్రబాబుకు లేఖ రాసినట్లు తెలిపారు. శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 866 అడుగుల వరకు ఉందన్నారు. 128 టీఎంసీల నీరు నిల్వ ఉందని, 842 అడుగుల నీరు ఉంటే పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా కేసీ రైతులకు నీరివ్వవచ్చునన్నారు. ప్రస్తుతం విద్యుత్ అవసరాలకు రోజుకు 41 వేల క్యూసెక్కుల నీరు వాడుతున్నారన్నారు. నీరు డ్యాంలోకి వచ్చే అవకాశం లేనందున విద్యుత్ ఉత్పత్తి కోసం నీటి వాడకాన్ని నిలిపి వేయాలన్నారు. పంటలను కాపాడాలంటే ఏప్రిల్ 15 వరకు నీరివ్వాలని లేకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు.

వరి ధాన్యం.. ధర తగ్గుముఖం

కష్టాలకోర్చి పంట సాగు చేసిన రైతుకు గిట్టుబాటు ధర లభించడం లేదు. ఈ ఏడాది కేసీ కాల్వ కింద వరి పంట సాగు చేసిన అన్నదాత.. నూర్పిడి చేసి ధాన్యం సిద్ధం చేశారు. వ్యాపారులు తక్కువ ధర చెబుతుండడంతో చివరికి నిరాశే మిగిలింది. దీంతో గోదాముల్లో నిల్వ ఉంచుకొనేందుకు సిద్ధమవుతున్నారు.

- మైదుకూరు నియోజకవర్గంలో మమ్మురంగా వరి నూర్పిళ్లు
- ధాన్యం కొనేందుకు ఆసక్తి చూపని వ్యాపారులు, దళారులు



ఈ రైతు పేరు లింగారెడ్డి రామోహన్‌రెడ్డి. చాపాడు మండలం రాజువారిపేటలో ఐదెకరాల్లో ఎన్‌డీఎల్ఆర్ రకం వరి పంట సాగుచేశాడు. తన సొంత పొలం రెండెకరాలకు తోడు, మరో మూడెకరాలు కౌలుకు తీసుకున్నారు. ఎకరాకు 36 బస్తాల చొప్పున దిగుబడి వచ్చింది. గత ఏడాది పుట్టీ(8బస్తాలు) రూ.18 వేలకు విక్రయించాడు. ధాన్యం ఇలా ఆరబెట్టుకుంటున్నాడు. వ్యాపారులు కొనేందుకు రాకపోవడంతో దిగాలు చెందుతున్నాడు.



చాపాడు మండలం కుందూనది సమీపంలో వరి కోస్తున్న యంత్రం

చాపాడు : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ముందే వర్షాలు పడటంతో శ్రీశైలం జలాశయంలో పుష్కలంగా నీరు చేరింది. దీంతో అధికారులు సకాలంలోనే కేసీ కాలువకు సాగునీరు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో మైదుకూరు నియోజకవర్గంలోని చాపాడు, దువ్వూరు, ఖాజీపేట, బ్రహ్మంగారిమఠం, మైదుకూరు, మండలాల్లో దాదాపు 28,700 ఎకరాలలో రైతులు వరి పంట సాగు చేశారు. వరి పైరును చీడపీడల నుంచి కాపాడుకోవడంతో ఎకరాకు 32 నుంచి 40 బస్తాల వరకూ దిగుబడులు వచ్చాయి. దీంతో అన్నదాత గత రెండు వారాలుగా పంట నూర్పిళ్లు ప్రారంభించారు.

ధర లేక.. దిగాలు

వరి పంట నూర్పిడి జరుగుతున్నా వ్యాపారులు ఆసక్తి కనబరచడం లేదు. గత ఏడాది వరి ధాన్యం పుట్టి(8 బస్తాలు) రూ.18 వేలు పలికింది. ఈ ఏడాది మాత్రం వ్యాపారులు రూ.12 వేలకు పుట్టీ ధాన్యం కావాలని అడుగుతున్నారు. రైతు కష్టపడి ఎకరా పొలంలో వరి సాగు చేసేందుకు రూ.35 వేలు ఖర్చవుతుంది. దీనికి అదనంగా కౌలు భూమికి రూ.10 వేలు చెల్లించాల్సిందే. గతేడాది దిగుబడులు తగ్గినా.. ఎకరా పంటపై రూ.25–30 వేల వరకూ రైతుకు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది పెట్టుబడులు వచ్చినా చాలని కోరుకుంటుండగా ధాన్యం కొనేందుకు వ్యాపారులు, దళారులు ఆసక్తి చూపడం లేదు. ధర గిట్టుబాటు కాకపోవడంతో గోదాముల్లో నిల్వ చేసుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకుని ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

మైదుకూరు నియోజకవర్గంలో వరి సాగు వివరాలివీ..

మండలం	వరి సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
మైదుకూరు	3000
చాపాడు	12000
దువ్వూరు	7500
ఖాజీపేట	4500
బ్రహ్మంగారిమఠం	1500

బాలికల అభ్యున్నతికి కృషి చేద్దాం

ప్రొద్దుటూరు : బాలికల అభ్యున్నతికి అందరూ కృషి చేద్దామని ఎంపీడీఓ సానేపల్లి సూర్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసంపై శుక్రవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ 11–18 ఏళ్ల లోపు వయసుగల బాలికల భవిష్యత్తు గురించి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. బాల్య వివాహాలను నిరోధించేందుకు గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటుచేశారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, మహిళా పోలీసులు ఇందులో ప్రధాన భూమిక పోషిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సావిత్రమ్మ, సీహెచ్ఓ కృష్ణమ్మ, అధ్యాపకురాలు జ్యోతి, ఏపీఎం వెంకట సుబ్బమ్మ, ఐసీపీఎస్ సునీత, జిల్లా కో ఆర్డినేటర్ స్వరూపరాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఈశ్వరి, రఫియా, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లపై దృష్టి సారించాలి

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలో పేరుకుపోయిన పన్ను బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి సిబ్బందికి సూచించారు. శుక్రవారం పట్టణంలో జరుగుతున్న పన్ను వసూలు కార్యక్రమాన్ని పరిశీలించి బకాయిలున్న యజమానులతో మాట్లాడారు. పట్టణ పరిధిలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.1.61 కోట్ల పన్ను బకాయిలు ఉన్నాయని, వీలైనంత త్వరగా పన్నుచెల్లించాలని కోరారు. అక్రమ కుళాయి కనెక్షన్లను త్వరితగతిన రెగ్యులర్ చేయించుకోవాలని, అలా చేయించుకోని పక్షంలో కుళాయి కనెక్షన్లు తొలగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రఘునాథరెడ్డి, షఫీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలానే పట్టణంలో శిథిలావస్థకు చేరి అపరిశుభ్రంగా, ప్రమాదకరంగా ఉన్న ఇళ్లను సంబంధిత యజమానులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. స్థానిక గుప్తానగర్‌లో శిథిలావస్థకు చేరిన ఇళ్లను కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం సంబంధిత యజమానులు తొలగించారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక సిబ్బంది సతీష్, నరసయ్య పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న కమిషనర్

సామాజిక మాధ్యమాలపై అవగాహన

ప్రొద్దుటూరు కల్చరల్ : సామాజిక మాధ్యమాలతో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని ప్రొద్దుటూరు రూరల్ ఎస్ఐ మహమ్మద్ రఫి తెలిపారు. మండలంలోని లింగాపురం వద్ద ఉన్న రాయలసీమ వ్యాయామ విద్యా కళాశాల విద్యార్థులకు సామాజిక మాధ్యమాలు, సైబర్ బెదిరింపులపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు లోన్ యాప్‌లు, బెట్టింగ్ యాప్‌ల జోలికి వెళ్ల వద్దన్నారు. ఎవరికి మొబైల్ ఇవ్వవద్దని, విద్యా సంబంధిత విషయాలకు మాత్రమే ఫోన్లను ఉపయోగించుకోవాలని సూచించారు. న్యాయవాది సీవీ.సురేష్, డాక్టర్ ఎస్.కవిత ప్రసన్న మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక మాధ్యమాలు వినియోగిస్తూ తమ సమయాన్ని వృథా చేయరాదని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రవిశంకర్, కార్యక్రమ అధికారి డాక్టర్ పి.భాస్కర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై నిర్లక్ష్యం వీడాలి

బద్వేలు అర్బన్ : విభజన హామీల్లో భాగమైన కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.చిన్ని, వి.శివకుమార్‌లు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన డీవైఎఫ్ఐ పట్టణ కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో ఎంతో మంది చదువుకున్న యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక గల్ఫ్ లాంటి దేశాలకు వలస పోతున్నారని, ఈ నేపథ్యంలో రాయలసీమ ప్రాంతంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశముందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో మన రాష్ట్ర ఎంపీలు ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై చర్చ జరిపి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. సమావేశంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్, పట్టణ నాయకులు నాగేంద్ర, ఇంద్ర, సురేష్, పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి ఆరోగ్య పరీక్షలు

చాపాడు : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి ఓబులేసు తెలిపారు. మండలంలోని నరహరిపురం వద్ద ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ హెల్త్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల్లో చదువుకుంటున్న ప్రతి విద్యార్థి ఆరోగ్య వివరాలను సేకరిస్తోందన్నారు. విద్యార్థులకు సంబంధించిన ఎత్తు, బరువు ఇతర ఆరోగ్య వివరాలను నమోదు చేస్తున్నామన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరిస్తామన్నారు. విద్యార్థులకు ప్రతి రోజూ మంచి ఆహారం తీసుకోవాలని, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మెనూప్రకారం ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నరసింహశాస్త్రీ, ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రాఘవయ్య, సూపర్‌వైజర్ టి.ప్రసాద్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

చీడపీడలకు తిరుగులేని అగ్ని అస్త్రం

మైదుకూరు : ఏ పంటలకైనా చీడపీడలు నివారించేందుకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో తయారు చేసుకున్న అగ్ని అస్త్రం తిరుగులేనిదని మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ అన్నారు. శుక్రవారం బ్రహ్మంగారిమఠం మండలం సోమిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన సిద్దారెడ్డి అనే రైతు పొలంలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఉపయోగించే వివిధ కషాయాల తయారీ విధానం వాటిని ఉపయోగించే పద్ధతల గురించి డాక్టర్ బాలకృష్ణ రైతులకు వివరించారు. కషాయాలలో ముఖ్యమైన అగ్ని అస్త్రం తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా చేసి చూపించారు. అగ్ని అస్త్రం తయారీ విధానానికి కావాల్సిన ముడి పదార్థాలైన సీతాఫలం ఆకు, వేపాకు, ఆవు మూత్రం, తెల్లగడ్డల పేస్ట్, పచ్చిమిరప పేస్ట్, పొగాకు మోతాదుల గురించి క్లుప్తంగా వివరించారు. ముఖ్యంగా ఏ పంటలకైనా అగ్ని అస్త్రం చీడపీడలను అరికట్టేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. అగ్ని అస్త్రాన్ని మూడు లీటర్లను 200 లీటర్ల నీటితో కలిపి పంటలకు పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ సీఈఓ శ్రీనివాసులు, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

దళితుల ఇళ్లను కూల్చివేయడం దారుణం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : బద్వేల్‌లో దళితుల ఇళ్లు కూల్చివేయడం దారుణమని, వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మునెయ్య డిమాండ్ చేశారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ బద్వేల్‌లోని ఐలమ్మ కాలనీలో బల్లి ఓబయ్య, దొడ్డగాల గంగయ్య 16 ఏళ్లుగా నివాసముంటూ, మున్సిపాలిటీ పన్ను కడుతున్నారన్నారు. అయితే గత రెండు నెలలుగా సయ్యద్ గుల్‌ఫర్, షేక్ జాఫర్, షేక్ నాయబ్, తదితరులు ఆ స్థలంలో తమకు పట్టాలిచ్చారు.. ఎంతో కొంత డబ్బు ఇస్తాం.. ఖాళీ చేయమని వేధిస్తున్నారన్నారు. ఈ నెల 22వ తేదీన ఓబయ్య, గంగయ్య తమ ఇంటి వద్ద లేని సమయంలో జేసీబీ తీసుకువచ్చి ఇళ్లు కూల్చివేశారన్నారు. తమకు అధికార పార్టీ నాయకుల అండ ఉందంటూ దళితులను భయభ్రాంతులకు గురిచేసే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కూల్చిన వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

చాపాడు : గ్రామీణ ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువల్లో దోమల వ్యాప్తి జరుగకుండా వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ రవిబాబు తెలిపారు. చాపాడులో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. డ్రైనేజీ కాలువలు, ఖాళీ ప్రదేశాలు, మురికి గుంటలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాలలో దోమ లార్వాలు ఏర్పడకుండా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని పరీక్షల ల్యాబ్‌ను, రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రాజేష్‌కుమార్, శ్రీవాణి, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, ఏఎన్ఎం ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.

బి.కోడూరు : కీటక జనిత వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని పోరుమామిళ్ల సబ్ యూనిట్ అధికారి టి.నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఐత్రంపేట గ్రామంలో ఫ్రైడే – డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. కాల్వల్లో అబేట్ ద్రావణం పిచికారీ చేయించారు.

వృద్ధులను ఆదరించడం గొప్ప విషయం

బద్వేలు అర్బన్ : వృద్ధులను, నిరాశ్రయులను ఆదరించడం గొప్ప విషయమని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, సబ్ జైలు సూపరింటెండెంట్ శ్రీహరిలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తెలుగుగంగ కాలనీలోని నిరాశ్రయుల వసతిగృహంలోని వృద్ధులకు రిటైర్డ్ సీఐ ఊటుకూరు బాలస్వామి ఆధ్వర్యంలో దుప్పట్లు, చాపలు, పండ్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ నిరాశ్రయుల వసతిగృహంలోని వృద్ధులను ఆదుకునేందుకు ముందుకు రావడం అభినందించదగ్గ విషయమన్నారు. శ్రీదేవి, బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

బి.కోడూరు : మండలంలోని తుమ్మలపల్లె రైతుసేవా కేంద్రంలో శుక్రవారం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీఏఏ బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ రైతులు మీసేవ కేంద్రానికి వెళ్లి ఆయా పంటల ప్రీమియం చెల్లించాలని తెలిపారు. ఎకరాకు వరికి రూ.630, శనగ, వేరుశనగకు రూ.480లు, జొన్నకు రూ.315, ప్రొద్దుతిరుగుడు రూ.300లు, మినుములు రూ.285లు, పెసలు రూ.270లు, నువ్వులకు రూ.180లు చొప్పున ప్రీమియం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎరిటాల వెంకటసుబ్బయ్య, జయరామ్‌రెడ్డి, శేషారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో ఉద్యోగావకాశాలు

రాజుపాళెం : వృత్తి విద్యా కోర్సులు అభ్యసించే విద్యార్థులకు ఎన్నో ఉద్యోగావకాశాలు ఉన్నాయని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ పి.తులశమ్మ అన్నారు. మండలంలోని వెల్లాలలోని పాఠశాల విద్యార్థులకు శుక్రవారం వృత్తి విద్యా కోర్సులపై శిక్షణ ఇచ్చారు. తులశమ్మ మాట్లాడుతూ తమ పాఠశాలలో రెండు కోర్సులు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వృత్తి విద్యా శిక్షకురాలు మంజుల, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అగస్త్యేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరీ దేవికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన జరిపారు. లోక కల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర హోమాలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగా గౌరీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను కాలక్షేపం మండపంలోని కల్యాణ వేదికపై ఆశీనులను చేశారు. వేద మంత్రోచ్చరణ మధ్య కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాడుపడిన సత్రాలు తొలగింపు

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం రాములవారి గుడి దగ్గర ఉన్న పాడుపడిన సత్రాలను డిసెంబర్ 2న తొలగించనున్నట్లు మఠం పిట్ పర్సన్ శంకర్‌బాలాజీ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుం సత్రాలలో 8 మంది వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. సత్రాలు పూర్తిగా శిథిలం కావడంతో వాటిని తొలగించి వాటి స్థానంలో నూతనంగా నిర్మాణాలు చేపట్టే విందంగా ప్రస్తుతం సత్రాల నిర్వాహకులకు అప్పచెప్పడం జరుగుతుందన్నారు.

ఉద్యోగాలకు విద్యార్థినుల ఎంపిక

ప్రొద్దుటూరు కల్చరల్: రాణితిరుమల దేవి డిగ్రీ కళాశాలలో బయోటెక్నాలజీ విభాగానికి చెందిన విద్యార్థినులు స్వప్న, ఫిర్దోష్, భవ్య, రోషన్, మైతిలీ, నాజియా, సాయి లావణ్య, స్రవంతి ఉగ్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కళాశాలలో బెంగళూరుకు చెందిన ఒమేగా హెల్త్ కేర్ శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో ఆన్‌లైన్ క్యాంపస్ డ్రైవ్, రాత పరీక్ష, ఇంటర్వ్యూలో తమ విద్యార్థినులు ప్రతిభ చూపి ఏడాదికి రూ.2.52 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఎంపికైన వారిని ప్రిన్సిపల్‌తోపాటు, కరస్పాండెంట్ తరుణేందు శేఖర్, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వెంకటేశ్వరరెడ్డి, డైరెక్టర్ సుబ్బరాయుడు, అధ్యాపకులు అభినందించారు.

ప్రొద్దుటూరు కల్చరల్: హైదరాబాద్‌కు చెందిన జెన్‌ట్ర టెక్నాలజీస్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో కళాశాల విద్యార్థినులు గంగోత్రి, శృతి, భావన, అయేషా పర్వీన్, వైష్ణవి, సన ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ డాక్టర్ రామసుబ్బమ్మ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సురేంద్ర పేర్కొన్నారు. మాట్లాడుతూ ఎంపికల్లో ప్రతిభ చూపిన ఆరుగురు విద్యార్థినులు ఏడాదికి రూ.4 లక్షల వేతనంతో ఉద్యోగాలు సాధించారన్నారు. కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్లు నాగూర్, రవీంద్రారెడ్డి, కోడైరెక్టర్ శైలూషావిద్యార్థినులను అభినందించారు.

పరీక్ష సామగ్రి అందజేత

బద్వేలు అర్బన్ : పట్టణంలోని మహబూబ్‌నగర్ వీధిలో ఉన్న ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో పరీక్షా సామగ్రితోపాటు నోటు పుస్తకాలు, పండ్లు పంపిణీ చేశారు. ఆవాజ్ జిల్లా అధ్యక్షులు పి.చాంద్‌బాషా మాట్లాడుతూ ఆవాజ్ కమిటీ 23వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సామాగ్రి పంపిణీ చేశామని తెలియజేశారు. కార్యక్రమంలో అబ్దుల్ సత్తార్, అన్వర్‌బాషా, మహబూబ్‌సాహెబ్, మస్తాన్, ఖాజా గౌస్, కె.బి.రసూల్ పాల్గొన్నారు.

శాస్త్రీయంగా పంటకోత ప్రయోగం

అట్లూరు : బద్వేలు అర్బన్ రైతుసేవా కేంద్రంలోని గూడెం గ్రామ రైతు మూరంరెడ్డి రామాంజనేయరెడ్డి పొలంలో శుక్రవారం నిర్వహించిన పంటకోత ప్రయోగాన్ని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ పరిశీలించారు. 5:5 మీటర్లలో 9.350 కిలోల దిగుబడి నమోదైందన్నారు.